క్లుప్తంగా

మొరాయించిన పేరుపల్లి రైల్వేగేట్

కారేపల్లి: కారేపల్లిలోని పేరుపల్లి (1కేకే) రైల్వే గేట్ గురువారం సాంకేతిక లోపంతో గురువారం మొరాయించింది. కొత్తగూడెం నుంచి డోర్నకల్ వైపు బొగ్గు లోడుతో గూడ్స్ రైలు వెళ్లాక గేట్ తెరిచే క్రమంలో ఓ వైపు తెరుచుకున్నా మరో వైపు తెరుచుకోలేదు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈమేరకు ఉద్యోగులు చేరుకుని మరమ్మతులు చేపట్టగా అరగంట తర్వాత గేట్లు తెరుచుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కారేపల్లిలోని రెండు గేట్లు తరచూ మొరాయిస్తున్నందున ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పల్లెవాడలో వైద్యశిబిరం

వేంసూరు: మండలంలోని పల్లెవాడ పంచాయతీలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారి శ్రీవిద్య 32మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించి మాట్లాడారు. పరిసరాలను శుభ్రంచగా ఉంచాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం గృహ సందర్శన చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

తల్లాడ: మండలంలోని మల్లవరంలో తాగునీటి సరఫరా పైపులైన్ ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.వెంకట కృష్ణ తెలిపారు. ఈ నెల 11న గ్రామానికి చెందిన దుగ్గిదేవర నరసింహారావు, దుగ్గిదేవర ఉపేంద్రరావులు పైప్‌లైన్‌ను పగులగొట్టారు. దీంతో మల్లవరం గ్రామ కార్యదర్శి సిద్దిక్ మియా ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భూవివాదంలో ఆరుగురిపై..

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామంలో భూ వివాదానికి సంబంధించి ఇరు వర్గాలకు చెందిన ఆరుగురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాశిమళ్ల ఫ్రాన్సిస్, గంటెల సురేష్ వర్గాల మధ్య బుధవారం భూ వివాదం చోటుచేసుకుంది. ఈమేరకు వారిరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు.. వారితో పాటుగా వారి సంబంధీకులైన మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

చింతకాని/బోనకల్: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చింతకాని, బోనకల్ ఎస్సైలు షేక్ నాగుల్ మీరా, పొదిల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కమిటీలను ఎన్నుకొని విగ్రహాలను ఏర్పాటు చేసిన రోజు నుంచి నిమజ్జనం జరిగే కమిటీ సభ్యులు పూర్తి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించే కమిటీ సభ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

ఎంపీడీఓకు వినతి

కొణిజర్ల: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ.. గురువారం అసిస్టెంట్లు ఎంపీడీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ అమ్మాజాన్‌లకు వినతులు అందించారు. నాలుగు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాలకు పూర్వ వైభవం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- సైన్స్ సెక్షన్లకు మొగ్గు చూపుతున్న వైనం..
- ఏటేటా పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం



నత్త నడకన సాగుతున్న కళాశాల నూతన భవన నిర్మాణం



మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఉత్తీర్ణతా శాతం
2023-24	130	58
2024-25	138	62
2025-26	175	66



శిథిలావస్థలో అధ్యాపక సిబ్బంది భవనం

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో పూర్వ వైభవం సంతరించుకుంటుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో కళాశాలకు సైన్స్ సెక్షన్లు మంజూరు కావడం, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయడం, ప్రిన్సిపల్, బోధనా సిబ్బంది కృషితో విద్యార్థుల సంఖ్య పెరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చి మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు.

కళాశాల వివరాలిలా..

1968వ సంవత్సరంలో 10 ఎకరాల సువిశాల స్థలంలో మధిరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించారు. 1969 నుంచి మొదటి బ్యాచ్ ప్రారంభమైనప్పుడు కళాశాలలో సీటు దొరకడం గగనమయ్యేది. రాను రాను ప్రైవేట్ కళాశాలల పోటీ పెరగడంతో ఆదరణ కోల్పోయింది. కానీ ఇక్కడ చదివిన వారు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. రాష్ట్ర విభజనకు ముందు 300మందికి పైగా విద్యార్థులు ఉండేవారు.. కానీ ప్రస్తుతం ఆంధ్రాకు చెందిన వారు చేరడం లేద. రాష్ట్ర విభజన తర్వాత అడ్మిషన్లు గణనీయంగా తగ్గాయి. ఇటీవల ఈ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిపారు.

అందుబాటులోని కోర్సులు..

ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ జనరల్ కోర్సులు ఉన్నాయి. అదేవిధంగా వృత్తి విద్యా కోర్సులైనటువంటి మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్), ఆఫీస్ అసిస్టెంట్ షిప్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కళాశాల విద్యార్థులు కబడ్డీ, వ్యాసరచన తదితర పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు గెలుపొందారు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు 155మంది విద్యార్థులకుగాను 175మంది జాయిన్ అయ్యారు. కమిషనర్ ఆదేశాలకు మించి అడ్మిషన్లు జరిగాయి.

పెరుగుతున్న ఆదరణ..

కళాశాలలో పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఉంది. మౌలిక వసతులతో పాటు శుద్ధి చేసిన తాగునీటి, పార్కింగ్ సౌకర్యాలు ఉండడంతో పాటు కళాశాల గదుల్లో, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పూర్వ వైభవాన్ని నిలబెట్టుకునేందుకు కళాశాల సిబ్బంది, దాతలు, పూర్వ విద్యార్థుల కృషి చేస్తుండడం గమనార్హం. కళాశాల దగ్గర్లో ఎస్సీ బాలుర హాస్టల్ ఉండడంతో దూరప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు నష్టం జరుగుతుంది. కళాశాలలో పనిచేస్తున్న లైబ్రేరియన్ ఫిజికల్ డైరెక్టర్‌గా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. తరగతి గదులతో పాటు అధ్యాపక సిబ్బంది భవనం శిథిలావస్థకు చేరుకుంది. కళాశాలకు మంజూరైన నూతన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి అయితే మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఎన్ఎస్ఎస్ యూనిట్‌లో విద్యార్థులు చురుగ్గా పనిచేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు..



కళాశాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైన్స్ సెక్షన్లు మంజూరు చేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధ్యాపకుల సహకారంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు సహకరిస్తున్నారు.

– బి.జయదాస్, కళాశాల ప్రిన్సిపల్

అడ్మిషన్లు పెరుగుతాయి..



ఎంతో ఘనకీర్తి కలిగిన మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20సంవత్సరాలుగా పనిచేస్తున్నా. కళాశాలకు నూతన భవనం మంజూరు కావడం వల్ల భవిష్యత్‌లో అడ్మిషన్లు ఇంకా పెరుగుతాయి. పరిసర గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– యూ.కృష్ణ, సీనియర్ అధ్యాపకుడు

కళాశాల బాగుంది..



కళాశాల విశాలంగా పచ్చని చెట్లతో అందంగా ఉంది. లెక్చరర్స్ పాఠాలు బాగా చెబుతున్నారు. కళాశాలకు సమీపంలో హాస్టల్ ఉంది. అందుకే పాలేరు నుంచి ఇక్కడ వరకు వచ్చి చదువుకుంటున్న. మంచిగా చదువుకొని పోలీస్ ఉద్యోగం సాధించాలన్నది నా కల.

– జి.రాకేష్, ఇంటర్ మొదటి సంవత్సరం

సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కరిస్తాం



మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

సత్తుపల్లిటౌన్: నమస్తే అందరు బాగున్నారా..? మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. సమస్యలు ఉంటే చెప్పండి.. పరిష్కరిస్తాం అంటూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కాలనీ వాసులకు భరోసానిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో గల 8, 9వ వార్డులలో గురువారం మార్నింగ్‌వాక్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని వీధుల్లో తిరుగుతూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. పారిశుద్ధ్య సమస్యలపై మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరి సంక్షేమం కోసం పని చేస్తుందని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం సింగరేణి నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆమె ప్రారంభించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు, హ్యాండ్‌గ్లౌజ్‌లు, క్యాప్‌లు అందించారు. అదే విధంగా స్థానిక పాతసెంటర్ పాఠశాలలో విద్యార్థినులకు నాప్‌కిన్స్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, సింగరేణి పీఓ ప్రహ్లాద్, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హౌసింగ్ ఏఈ పవన్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, చెన్నారావు, సుజలరాణి, కమల్‌పాషా, సామేలు, కరుణాకర్, వెంకటేశ్వరరావు, సందీప్‌గౌడ్, రామ్మోహన్ రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు పరికరాలు పంపిణీ

సత్తుపల్లి(కల్లూరు): ఆలీమ్‌కో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 29 తేదీల్లో ఖమ్మం నయాబజార్ స్కూల్ నందు వివిధ రకాల వైకల్యాలు ఉన్న 18 సంవత్సరాల లోపు పిల్లలకు అవసరమైన పరికరాలు అందించడం జరుగుతుందని ఎంఈఓ పత్తిపాటి నివేదిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నడవలేని పిల్లలకు చక్రాల కుర్చీలు, చెవులు సరిగా వినపడని వారికి వినికిడి యంత్రాలు, చూపు సరిగా కనపడని వారికి బ్రెయిలీ కిట్స్, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు ఎంఎస్ఐడీ కిట్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సీఎస్‌డబ్ల్యూఎన్ చైల్డ్ ఆధార్‌కార్డు జిరాక్స్, పిల్లల సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు జిరాక్స్, వైకల్యం కనిపించే పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తీసుకుని క్యాంప్‌కు రావాలని సూచించారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయం, ఫోన్ 9866987810ను సంప్రదించాలని కోరారు. ని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు.

విజయ కళాశాలలో ఓరియెంటేషన్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ ఉషాకిరణ్‌కుమార్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యనందించడంలో కళాశాల ఎప్పుడు ముందుంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఆయేషా తరుణమ్, డీన్ శ్రీనివాసరావు, ఏఓ ఫరీద్ బాబా పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

మధిర: విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ వై.ప్రభాకర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పది విద్యార్థులను కలిసి హాజరుశాతం, సబ్జెక్ట్‌ల వారీగా ప్రగతిని పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, స్వయంగా ఆహారాన్ని భుజించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో కూరగాయ మొక్కలను సాగు చేయాల్సిందిగా సూచించారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చింతకాని: మాట్లాడుతున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర, అధికారులు

చింతకాని/బోనకల్: పంటలకు ఆశించే చీడపీడలు, పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ చంద్ర పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతువేదికలో ఎల్‌డీసీ, కేవైఆర్‌డీ సంయుక్త ఆధ్వర్యంలో పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు నివారణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి విత్తనాలను నాటిన 45రోజుల నుంచి పంటలో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించాలని, నివారణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం చింతకానిలోని నాగిలిగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుచరిత, ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ పావని, చింతకాని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మాదిన్ని రవి, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, కారుణ్య సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఫణిశ్రీ, సరస్వతి, మండల వ్యవసాయధికారులు సోములపల్లి మానస, పసునూరి వినయ్ కుమార్, వ్యవసాయ విస్తర్ణాధికారులు తేజ, అయేషా, తాహియా నౌషీన్, రాము, కల్యాణి, కార్తీక్, రజిత, అనూష, త్రివేణి, హుస్సేన్ సాహెబ్, హరికృష్ణ, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక లాభాలు



వైరారూరల్: రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

కారేపల్లి/వైరారూరల్: భూమి సారవంతంగా ఉండాలంటే యూరియా వాడకాన్ని తగ్గించి, నానో యూరియా ను రైతులు పంటలకు పిచికారీ చేయాలని తద్వారా అధిక దిగుబడితో పాటు, భూసారాన్ని కోల్పోదని మండల వ్యవసాయాధికారులు బట్టు అశోక్‌కుమార్, మయాన్ మంజుఖాన్ తెలిపారు. గురువారం కారేపల్లి, వైరారూరల్ మండలంలోని కేజీ సిరిపురం, గరికపాడు గ్రామాల్లోని సొసైటీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు. సొసైటీలోని స్టాక్‌ను, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఎరువులను అధిక మోతా దులో కాకుండా దఫా దఫాలుగా వినియోగించాలని సూచించారు. డీలర్లు ఎవరైనా యూరియా కొనుగోలు లింక్ సిస్టమ్ చేపడితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలో యూరియా సేల్‌పాయింట్‌ను ఏర్పాటు చేయనున్నామని, రైతుల పంట నష్టంపై సర్వే చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓలు బొల్లు హన్మంతరావు, అక్కిశెట్టి రామకృష్ణ, ఇన్‌చార్జ్ నారపోగు నాగరాజు, ఏఈఓలు వెంపటి కీర్తి, ధరావత్ సైదులు, ఎస్‌కే మున్నీ, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా కేంద్రాలు పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో యూరియా పంపిణీ నాలుగు కేంద్రాలకు పెంచాలని కోరుతూ గురువారం సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న వైరా ఏడీఏ కరుణశ్రీ, ఏఓ బాలాజీలు సొసైటీ కార్యాలయం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడుతూ.. యూరియా పంపిణీ కేంద్రాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు, కొప్పుల కృష్ణయ్య మాట్లాడుతూ.. కొణిజర్లలోని గోపవరం సొసైటీలోనే రైతులకు యూరియా పంపిణీ చేయడంతో మారుమూల గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కొణిజర్లతో పాటు పెద్దమునగాల, తీగలబంజర, గుబ్బగుర్తి, తనికెళ్లలో యూరియా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, చలపతిరావు, నరసయ్య, మాధవరెడ్డి, కృష్ణయ్య, ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేయాలి

వేంసూరు: రైతుల పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న భూమి ఆధారంగానే రైతులకు యూరియా పంపిణీ చేయాలని ఏఓ రాంమోహన్‌రావు, ఎస్సై కవిత పేర్కొన్నారు. గురువారం వేంసూరు రైతు వేదికలో పీఏసీఎస్ సీఈఓలకు, ఆగ్రోస్, గ్రోమోర్, ప్రైవేట్ ఎరువుల షాపుల యాజమానులతో ఎరువుల విక్రయాలపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా అమ్మకాల్లో జాగ్రత్తలు పాటించడంతో పాటు6 గంటల నుంచి కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ శ్రీనివాసులు, ఏఈఓలు రీమా, కావ్య, అక్షర, సందీప్, సొసైటీ సీఈఓలు, ప్రైవేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి స్నేహితుల చేయూత



అనిల్ కుటుంబానికి బాండ్ అందజేస్తున్న స్నేహితులు

కారేపల్లి: ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ అనిల్ కుమార్ కుటుంబానికి ఆయన స్నేహితులు అండగా నిలిచారు. కారేపల్లి విద్వాన్ హైస్కూల్ ఎస్ఎస్‌సీ–2009 బ్యాచ్ విద్యార్థులు సేకరించిన రూ.లక్ష నగదును అనిల్ ఎనిమిది నెలల కుమారుడి పేరిట ఫిక్స్ చేసి గురువారం సూర్యతండాలో సంస్మరణ సభలో అందజేశారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్, హిమబిందు, సందీప్, ప్రశాంత్, అశ్విని, ఉమాదేవి, కుమారస్వామి, భవనాసి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

మధిర: ప్రయాణికుడు మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను బస్సు డ్రైవర్, కండక్టర్ అందించి వారి నిజాయితీ చాటుకున్నారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, విజయవాడ నుంచి మధిరకు వస్తుండగా కర్ణాకు చెందిన ప్రయాణికుడు శ్రీకాంత్‌నాయక్ తన సీట్‌లో సెల్‌ఫోన్ మర్చిపోయి దిగి వెళ్లిపోయాడు. దానిని గమనించిన బస్సు సిబ్బంది మొబైల్‌లోని నంబర్స్ ద్వారా వారి బంధువులకు సమాచారం అందించగా.. విషయం తెలుసుకొని డిపోకి వచ్చిన ప్రయాణికుడికి ఫోన్‌ను అందించారు. దీంతో డ్రైవర్, కండక్టర్ లను డిపో మేనేజర్ డి.శంకర్‌రావు అభినందించారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహుకరణ

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జెడ్పీ పాఠశాలలో 1989–94 వరకు విద్యనభ్యశించిన పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను బహుకరించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న తోటి మిత్రురాలు పంగి ప్రమీలకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు సాయమందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మార్క్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలు గుర్తించాలి

సత్తుపల్లిరూరల్: బలహీనంగా ఉన్న పిల్లల్లో క్షయ వ్యాధి బారినపడే అవకాశం ఉందని, ఈ టీబీ లక్షణాలు ఉన్న పిల్లలను గుర్తించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యురాలు స్పందన అన్నారు. గురువారం గంగారం పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.ప్రభాకర్, డీఎస్ఎం శివకుమారి, డాక్టర్ ఖాసీ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, శారారాణి, విజయకుమారి, రామారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు



వైరా సాయిమందిరంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

వైరా: వైరాలోని షిరిడీ సాయి మందిరంలో (సాయి నగర్) శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజలకు పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కుంకుమ పూజలకు కావాల్సిన అన్ని సదుపాయాలు సమకూర్చారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

వైరా: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వైరాలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పట్టు చీర, సారె అలంకరణ సామాగ్రి అందించి దేవాలయ పూజారి రాజశేఖరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రతినిధులు గ్రంధి ప్రవీణ్‌కుమార్, పెనుగొండ ఉపేందర్ రావు, వైరా పట్టణ అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు తెలిపారు. శ్రీనివాసరావు, రాఘవరావు, రాము, రాజారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్: ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాజభలను విజయవంతం చేయాలని ఆ సంఘం కల్లూరు డివిజన్ కార్యదర్శి బీరెట్టి లాజరు అన్నారు. గురువారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్ల బోనస్ ఇవ్వాలని, రుణమాఫీ, రైతుబంధు పథకాలు అమలు చేయాలన్నారు. రైతాంగ సమస్యలపై నిరంతరం రైతు సంఘం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ కల్లూరు డివిజన్ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి, తాటి రాజు, కందిమళ్ల నాగప్రసాద్, బొజ్జ విశ్వనాథం, నడికుదురు భాస్కర్, ఆదాం, దుంప రాఘవులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పెద్ద నర్సిరెడ్డి

మధిర: మండలం పరిధిలోని దేశినేనిపాలెం గ్రామంలో.. కంచం స్వాతి, రామకృష్ణకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు గురువారం మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెద్ద నర్సిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, గ్రామ మాజీ వైస్ సర్పంచ్ రామకృష్ణ, గంగయ్య, కిట్టయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో గురువారం ప్రభుత్వం మంజూరు చేసిన పలువురి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, లక్ష్మణరావు, భాస్కరరావు తదితరులున్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

చింతకాని: చింతకానిలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా లింగం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా చిట్టూరి నరేష్ లతో పాటు మరో 9మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను పలువురు అభినందించారు.


ఘనంగా బంజారాల కడవ పండుగ

మధిర:మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో బంజారాలు కడవ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్, ప్రధాన తల్లి, దేవత మెరామా యాడికి బంజారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరావు అన్నారు. గురువారం మండల కేంద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘం పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్, మూడ్ పుల్లయ్య, శ్రీదేవి, జెపుల్లయ్య, రాఘవారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న రంగారావు

మధిర: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు అన్నారు. గురువారం యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీవీఎం పాఠశాలలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

సత్తుపల్లిటౌన్: బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సత్తుపల్లి సొసైటీ ఆధ్వర్యాన స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బ్రహ్మకుమారి రాధిక తెలిపారు. అందరు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు హాజరు.. టీచర్ గైర్హాజరు



రఘునాథగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఎదురుచూస్తున్న విద్యార్థులు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమిది. మండలంలోని రఘునాథగూడెం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సమయం ప్రకారం పాఠశాలకు హాజరయ్యారు.. కానీ ఉపాధ్యాయుడు మాత్రం దుమ్మా కొట్టాడు. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల. ఏకోపాధ్యాయ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సెలవు పెట్టినట్లయితే ప్రత్యామ్నాయంగా మరో టీచర్, కాంప్లెక్స్ పరిధిలో గల సీఆర్‌పీని గాని ఆ పాఠశాలకు పంపించి తరగతులు నిర్వహించాలి. కానీ గురువారం ఉదయం 10 గంటల వరకు కూడా ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు కూర్చుని వెళ్లిపోయారు. కల్లూరు మండలానికి పూర్తికాలపు విద్యాశాఖ అధికారులు లేకపోవడం వల్ల విద్యాశాఖపై, ప్రభుత్వ పాఠశాలలపై అజమాయిషి కరువైంది. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంఈఓ పత్తిపాటి నివేదితను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉపాధ్యాయులే సమయపాలన పాటించకపోతే పిల్లలకు ఎలాంటి క్రమశిక్షణ నేర్పుతారని ప్రశ్నించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.